క్లుప్తంగా

తాగునీటి పథకం ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మోస్య, జెడ్పీటీసీ గంగరాజు తదితరులు

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ దొరగుడ గ్రామంలో జెడ్పీటీసీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన తాగునీటి పథకాన్ని బుధవారం సర్పంచ్ మోస్య, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ గతంలోని తాగునీటికి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఈ విషయంపై జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లగా స్పందించారన్నారు. గ్రామస్తుల తరఫున ప్రభుత్వానికి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దేవన్న తదితరులు పాల్గొన్నారు.

30న సంత వేలంపాట

రంపచోడవరం: రంపచోడవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం సంత వేలంపాట నిర్వహించారు. రంపచోడవరం విస్తరణ అధికారి జాన్ విల్సన్ ఆధ్వర్యంలో రంపచోడవరం పరిధిలోని జూలై నుంచి 2024, మార్చి 31 వరకు వారపు సంత ఆశీలుకు వేలంపాట నిర్వహించారు.
వేలంపాటకు పాటదారులు ముందుకు రాకపోవడం వలన తిరిగి శుక్రవారం ఉదయం పంచాయతీ ఆవరణలో వేలంపాట నిర్వహిస్తామన్నారు.

ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా సింహాద్రి



పెదబయలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా కోడా సింహాద్రి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం కృష్ణవేణి బదిలీపై వెళ్లడంతో పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు కోడా సింహాద్రిని హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగిస్తు విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు ఉన్నత విద్య అందించడానికి తన వంతు కృషి చేస్తామన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక ఇందిరా కాలనీలో మంగళవారం కిలగాడ వైద్యాధికారులు రమేష్, శిరీషా ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బంది కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు రమేష్, శిరీషా మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే నెల 16వ తేదీ వరకు జరుగుతుందన్నారు. చర్మం పొడిగా ఉండడం, స్పర్శ లేకపోవడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం వంటివి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి కుష్టు వ్యాధి చికిత్స పొందాలని సూచించారు. వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, వేదవతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

లైజన్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి వినతి



ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న గిరిజన సంఘం నేతలు

జి.మాడుగుల: కాఫీ పనులు చేస్తున్న లైజన్‌వర్కర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై గిరిజన సంఘం నాయకులు, పలువురు కార్మికులు మంగళవారం పాడేరు ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఐటీడీఏ కార్యాలయంలో ఏఈవోగా పనిచేస్తున్న అప్పలనాయుడు పలువురు లైజన్ వర్కర్ల జీతాలు నిలుపుదల చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ వినతిలో పేర్కొన్నారు. దీనిపై ఏడీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ చేస్తామన్నారు.

ముస్లిం పెద్దలతో సమావేశం

రంపచోడవరం/రాజవొమ్మంగి: రంపచోడవరం, రాజవొమ్మంగిలో ముస్లింల పెద్దలతో మంగళవారం ఆయా ప్రాంతాల్లో సీఐలు సురేష్ బాబు, షేక్‌బాజీలాల్ సమావేశం నిర్వహించారు.రానున్న బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని కోరారు. మసీదుల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్, ముస్లిం పెద్దలు, గౌస్, దావూద్, అలీ, సుల్తాన్, లతీఫ్, హుస్సేన్, బాజి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు



ఇంజరి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్న గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది

- మారుమూల గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- ఇంటికే ఉచిత వైద్యం
- ప్రజలకు తప్పిన కష్టాలు

పెదబయలు: ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ప్రజల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలతో పాటు ప్రజారోగ్యం ప్రధానం అని గుర్తించింది. ఇందులో భాగంగా 'ఫ్యామిలీ డాక్టర్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకెళ్లింది. దీంతో ఈ పథకం పేద, మధ్య తరగతి ప్రజల పాలిట వరంగా మారింది. జిల్లాలో 22 మండలాల్లో 25 అంబులెన్స్‌లు(104) వాహనాల్లో సగటున రోజువారిగా 1500 మందికి ఇంటి ముంగిటే వైద్యం అందుతుంది. పెదబయలు మండలంలోని అతి మారుమూల పంచాయతీలైన ఇంజరి, గిన్నెలకోట, జామిగుడ, కుంతుర్ల పంచాయతీల్లో ఆదివాసీ గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రతీ రోజు వైద్యం అందుతుంది. గతంలో ఈ పంచాయతీల ప్రజలు 35 నుంచి 40 కిలోమీటర్లు వైద్యం కోసం గోమంగి, రూడకోట, లబ్బూరు., పెదబయలు, జి.మాడుగుల, రూడకోట పీహెచ్‌సీలకు వచ్చి వైద్యం పొందేవారు. ముఖ్యంగా గర్భిణులు,బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు అవస్థలు పడేవారు. నేడు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల మారుమూల గ్రామాల ప్రజలతో పాటుగా ఇతర ప్రాంతాల ప్రజలకు వరంగా మారింది. వైద్యంలో పాటుగా అన్ని 14 రకాలు పరీక్షలు చేస్తుండడంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెంతకే వైద్యసేవలందుతుండడతో గిరిజనులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



మారుమూల గ్రామానికి వెళ్తున్న 104 వాహనం

అల్లూరి జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ సేవల వివరాలు

104 వాహనాలు	:	35
రోజువారి సగటు ఓపి	:	1500
సిబ్బంది	:	103

నాడు వైద్యం కోసం 3 గంటల ప్రయాణం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డ్యాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటికే డాక్టర్ వచ్చి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేస్తున్నారు. గతంలో వైద్యం కోసం రూడకోట పీహెచ్‌సీకి సుమారు 3 గంటలు ప్రయాణం చేసి ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుంది. చాలా ఆనందంగా ఉంది.

–పాంగి గురుబడి, గృహిణి, జామిగుడ, పెదబయలు మండలం

ఎంతో ఉపయోగకరం



ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. మండలంలోని అతి మారుమూల ఇంజరి, గిన్నెటకోట, జామిగుడ పంచాయతీ గ్రామాల్లో కూడా ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యం అందిస్తున్నాం.ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. రోజువారిగా 50 నుంచి 60 ఓపీ వస్తుంది. ఎక్కువగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు వైద్యం పొందుతున్నారు. ప్రజలు మరింతగా ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.కిరణ్‌కుమార్, వైద్యాధికారి, గోమంగి పీహెచ్‌సీ

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



పథకాల అమలుతీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదలబుడు మేజర్ పంచాయతీ అరకులోయలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 380 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సకాలంలో సక్రమంగా పథకాలు అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గ్రామాల్లో గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుక సబ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు, ఉన్నత విద్య అందుతోందన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, సుపరిపాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా తనకు నేరుగా తెలియజేస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ ఉషారాణి, పార్టీ యువజ విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, ఎస్‌ఐ సంతోష్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, నాయకులు ముఖి సాంబ, లక్ష్మణ్‌కుమార్, నర్సింగ్, దివ్య, శివ, తిరుపతి, శెట్టి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జెడ్పీటీసీ జానకమ్మను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: మండల జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం సంతబయలు గ్రామంలో ఉంటున్న జానకమ్మను కలిసి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవసరాలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, శారద , ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, నాయకులు సింహాచలం, కిరణ్, నాగేశ్వరరావు, బాబూరావు, కృష్ణారావు, బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ



రంపలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి తదితరులు

రంపచోడవరం: ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మిలు అన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద గిరిజన రైతులకు 90శాతం రాయితీపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజన రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ రైతులు మండల కేంద్రానికి వెళ్లకుండా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్దకే విత్తనాలు ఎరువులు అందజేయడం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు.. రైతులు తమ పంటను ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఎరువుల వాడకం తగ్గించాలని, వ్యవసాయ సిబ్బంది యొక్క సూచనలు సలహాలు పాటించి మంచి దిగుబడులు పొందాలన్నారు. ఏఓ కే లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో సుమారు 3500 ఎకరాల పైబడి వరిసాగు చేస్తున్నారన్నరు. ఈ ఖరీఫ్ సీజన్‌కు 950 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేసి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. సర్పంచ్ చెదలదేవి, మద్రివాడ సర్పంచ్ కారం కుమారి, ఉప సర్పంచ్ చిన్నం కరుణేంద్ర బాబు, వ్యవసాయ సహాయకులు చుక్కా అభినవ్ రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాలయ్య



కూనవరంలో బోరు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ అనంతలక్ష్మి తదితరులు

చింతపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య మంగళవారం భూమి పూజ నిర్వహించారు. బొర్రమామిడిలో జెడ్పీ నిధులతో తాగునీటి బోరు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలో రూ.3.80లక్షలతో మూడు బోర్లు, డ్రైనేజీ మరమ్మతుకు రూ.4 లక్షలు, సోమవరం గ్రామంలో అంగన్‌వాడీ భవనం మరమ్మతుకు రూ.5 లక్షలు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ సన్యాసమ్మ, ఎంపీటీసీ సోని తదితరులు పాల్గొన్నారు.
కూనవరం: కూనవరంలో మూడవ వార్డు సభ్యురాలు సూరం బాయమ్మ వీధిలో ఎంపీటీసీ నిధులు రూ. 1.30 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు పనులకు ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మాని అనంతలక్ష్మి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఎంపీటీసీ పరిధిలో కొత్తగా అల్లంకి రాజు వీధిలో రూ.1.30లక్షల వ్యయంతో ఒకటి, ఇప్పుడు బాయమ్మ వీధిలో మరి కటి మొత్తం 2.60 లక్షలతో తాగునీటి బోర్లు వేసినట్లు చెప్పారు. మరో రెండు బోర్లకు మరమ్మతు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ మండల మహిళా ఉపాధ్యక్షురాలు కొమ్మాని సునీత, సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



దుశ్చర్తిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: ఉపాధి హామీ పనుల్లో అందరినీ భాగస్వాములు చేయాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. అడ్డతీగల మండలం దుశ్చర్తి, డి.రామవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులతో పాటు అక్కడ నమోదు చేస్తున్న మస్టర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్క వ్యక్తికి తప్పనిసరిగా పనుల్లో భాగస్వాములను చేయాలన్నారు. మస్టర్ల నమోదులో అవకతవకలకు తావివ్వవద్దని ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, మేట్‌లను ఆదేశించారు. దుశ్చర్తిలో మూడు చెరువుల్లో అభివృద్ధి పనులు చేయించాలని స్థానికులు కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల అభ్యర్థన మేరకు ఆయా చెరువులను స్వయంగా పరిశీలించామన్నారు. చెరువుల అభివృద్ధితో సాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. చెరువుల్లో అభివృద్ధి పనుల నిమిత్తం తగిన ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని దుశ్చర్తి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



లంగుపర్తి పీహెచ్‌సీలో వైద్యసేవలను పొందుతున్న కన్నయ్యను పరామర్శించిన నాయకులు

అనంతగిరి: మండలంలోని వాలసీ పంచాయతీ సర్పంచ్ సన్యాసిరావు తండ్రి కన్నయ్య బుధవారం పాముకాటుకు గురయ్యారు. కన్నయ్యను వైద్య సేవలు నిమిత్తం కుటుంబ సభ్యులు లంగుపర్తి పీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డు డైరెక్టర్ కొర్రా సూర్యనారయణ, మండల సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు స్వామి, లంగుపర్తి పీహెచ్‌సీకి వెళ్లి, కన్నయ్యను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ గంగన్నదొర, లంగుపర్తి సర్పంచ్ సన్యాసిరావు, మండల కన్వీనర్ నవీన్, గుమ్మ కన్వీనర్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న అమ్మఒడి సొమ్ములు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలంటే తల్లిదండ్రులు వారి వివరాలను వలంటీర్ ద్వారా ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తు అమలు చేస్తున్న నాడు–నేడు, విద్యాకానుక, గోరుముద్ద, వసతి దీవెన మొదలైన పథకాలపై అవగాహన కల్పించారు. సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

గంగవరం: మొల్లేరు గ్రామంలో దుర్గమ్మ గుడి సమీపంలో చెత్త పేరుకుపోయిన అపరిశుభ్రంగా మారిందని కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటి సభ్యుడు జి.కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ని వివరణ కోరగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు సొలభం, మొల్లేరులో 'గడప గడపకు'

జి.మాడుగుల: మండలంలో సొలభం సచివాలయం–1 పరిధిలో సొలభం, కుడ్డంగి, తోటలగొంది గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు సుర్ల మత్స్యకొండంనాయుడు, ఉవ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
గంగవరం: మొల్లేరులో బుధవారం గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరుకావాలన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

మొల్లేరులో బుధవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటిస్తున్నారని, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ కొటికలపూడి రామతులసి, మండల పార్టీ కన్వీనర్ అప్పలరాజు, ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ తెలిపారు. నెల్లిపూడిలో ఉదయం 11 గంటలకు పర్యటిస్తారని, అనంతరం మొల్లేరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. వైస్ ఎంపీపీ రామతులసి, సర్పంచ్ లక్ష్మి, పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

జేవీకే కిట్‌లను త్వరితగతిన పంపిణీ చేయాలి



స్కూల్ బ్యాగులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జేవీకే కిట్‌ల స్టాక్ పాయింట్‌ను ఎంపీడీవో చంద్రశేఖరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాగుల నాణ్యతను ఆయన పరిశీలించారు. మండలానికి 2840 బ్యాగులు వచ్చినట్టు విద్యా శాఖ సిబ్బంది తెలిపారు. కిట్‌లను త్వరితగతిన పంపిణీ చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఏపీఎం, ఎంఈవో–2 సుందరమ్మ, సీఆర్‌పీలున్నారు.

పాఠశాల తనిఖీ

మండలంలో పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో చంద్రశేఖరరావు సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాలలో పలు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాయలంలో పీఎంఈజీపీ రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఆయన నిర్వహించారు.

సమావేశంలో సమస్యల వెల్లువ



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ చలపతి

రాజవొమ్మంగి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యంగా మైనర్ ఇరిగేషన్, ఫారెస్ట్, ఆర్ అండ్‌బీ వంటి కీలకమైన శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరవడంపై పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారులకు గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్లు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి సకాలంలో ఎందుకు నివేదించలేదని జడ్డంగి, దూసరపాము సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివలు ఏఈ వీరభద్రరావును ప్రశ్నించారు. జడ్డంగి– చిన్నయ్యపాలెం, రాజవొమ్మంగి–అప్పలరాజుపేట రోడ్ల పరిస్థితిని సభ దృష్టికి తెచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్ల సమస్యను ప్రస్తావించారు.మండలంలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను గుర్తించి వాటిని సమన్వయంతో పరిష్కరించుకుందామని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి సభ్యులతో చెప్పారు. సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలానికి ఆరు గోశాలలు మంజూరైనట్టు గిరిజన సంక్షేమ శాఖ ఏఈ వీరభద్రరావు చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే ఆయా భవనాలను పశుసంవర్ధక శాఖకు అప్పగించనున్నట్టు తెలిపారు.మండలానికి ఉపాధి మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో పలు రహదారులు మంజూరైనట్టు చెప్పారు. మండలానికి 254 గృహాలు మంజూరు కాగా ప్రస్తుతం 120 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని హౌసింగ్ ఏఈ చలపతి చెప్పారు.లబ్ధిదారులందరికీ ప్రోత్సాహకంగా తొలుత రూ. 5వేల చొప్పున అందజేశామన్నారు. బిల్లుల మంజూరు మూడు దఫాలుగా బిల్లులు అందజేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, సొసైటీ చైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తదతరులు హాజరయ్యారు.

జగనన్న సురక్ష లక్ష్యాన్ని అధిగమించాలి



భీంపోల్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై జిల్లాలో విస్తృతంగా అవగాహన, సర్వే కార్యక్రమాలు జరుగుతోంది. ఇంటింటా వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలు నమోదు వివరాలు, సమస్యల వివరాలను సేకరిస్తున్నారు. అనంతగిరి మండలంలోని భీంపోల్, గుమ్మకోట సచివాలయాల్లో సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లతో ఎంపీపీ శెట్టి నీలవేణి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ధ్రువపత్రాలను మంజూరుచేయాలన్నారు. జగనన్న సురక్ష లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఎంపీడీవో కుమార్, సర్పంచ్ అప్పారావు, కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
డుంబ్రిగుడ: కొర్రా పంచాయతీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద రావు, సర్పంచ్‌లు అర్జున్, గుమ్మ నాగేశ్వర రావు, ఎంపీటీసీ విజయ, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, నాయకులు సింహాచలనం చిరంజీవి పాల్గొన్నారు.
గూడెంకొత్తవీధి: మండలంలోని లక్కవరపుపేట సచివాలయంలో జరిగిన సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీపీ బోయిన కుమారి సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎంపీటీసీలు సత్యనారాయణ, కృష్ణమూర్తి, ఎంఎల్‌వో లోవరాజు, కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
హుకుంపేట: మండలంలోని భీమవరం, అండిభ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కిల్లో రామకృష్ణ, ఎంఎల్‌వో శివరామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, సర్పంచ్ నైని సన్నిబాబు, కన్వీనర్ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.
కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో లాలం సీతయ్య, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ సింహాచలం పాల్గొన్నారు. గోపవరంలో జెడ్పీటీసీ వారా నూకరాజు, సర్పంచ్ నూకాలమ్మ, ఉప సర్పంచ్ ధారలక్ష్మి పాల్గొన్నారు.
చింతూరు: మండలంలోని కల్లేరు, చట్టి, కుమ్మూరు సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమంలో మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కన్వీనర్లు మురళి, రెడ్డి రాంప్రసాద్, రాంబాబు, శ్రీను పాల్గొన్నారు.



జీకే వీధిలోని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి



కొయ్యూరులో వినతులను పరిశీలిస్తున్న ఎంపీపీ రమేష్, పక్కన ఎంపీడీవో సీతయ్య